ఇంకా చీకటి పడలేదు.

శివుడు గొడ్ల చావట్లో గాటిపక్కన కూర్చుని ఎండిన పిడక లేరి తట్టలో పడవేస్తున్నాడు. ఆ పదేళ్ళ బాలుని లేత చేతులు చకచకా కదులుతున్నాయి. అతను అప్పుడే బడినుంచి వచ్చాడు. ప్రొద్దుట తిన్న అన్నం ఎప్పుడో అరిగిపోయి, ఆకలితో ఆవురావురు మంటున్నాడు.

కాని, పిడక లేరి, గేదె దగ్గర అంతా శుభ్రం చేసి, కుడితి తాపి, బావిలోంచి నీళ్ళు లాగి తొట్టి నింపనిదే పెద్దమ్మ అన్నం పెట్టదు.

అందుకే గబగబా పని చేస్తున్నాడు. అతని మనస్సు పిడకల మీద లేదు. అతని కళ్ళు రాత్రి వచ్చిన కలను నెమరు వేస్తున్నాయి. ఆ కల అతనికి అంతకు ముందు చాలాసార్లు వచ్చింది.

మంచం! మెత్తటి పరుపు, దోమతెర! అందులో తను హాయిగా పడుకున్నట్టు!

పిడక లేరుతున్న శివుడి ఒళ్ళు పులకరించింది.

అంతలోనే ఉన్నట్టుండి—"అమ్మో, బాబో!" అంటూ కేకలు పెడుతూ లేచాడు. అమ్మ రాలేదు, బాబు రాలేదు. వారు రారు, వారు లేరు.

"ఏ మొచ్చి పడిందిరా, నిన్ను తగ లెయ్య!" అంటూ కమలమ్మ నిదానంగా

పులిచెర్ల
సుబ్బారావు


కదిలి వచ్చింది. మోహన్, మీనాక్షీడా వచ్చారు. సినిమా పత్రిక తిరగవేస్తున్న వాసు కిదేం పట్టదు.

"తేలు కుట్టింది, పెద్దమ్మా! అమ్మా ..." అంటూ బాధతో చిందులు తొక్కసాగాడు శివుడు.

"డాన్స్! భలే బాగుంది" అంటూ నవ్వుతూ చప్పట్లు చరిచాడు మోహన్. వాడు శివుడికన్నా ఏడాది పెద్ద.

"గండు చీమ కుట్టి ఉంటుంది. అంతమాత్రానికే చావు కేకలు పెడతావేరా, చచ్చు సన్నాసీ!" అంది కమలమ్మ.

"కాదు, పెద్దమ్మా! తేలే! అమ్మో! నొప్పి! బాబో!" అంటూ శివుడు మరింత పెద్దగా ఏడవసాగాడు.



"ఇంకేం? ఈ పూటకి పని తప్పించుకున్నావు" అంటూ నిశ్చలంగా లోపలికి వెళ్ళిపోయింది కమలమ్మ.

మోహన్ తెగ నవ్వుతున్నాడు. కాని, మీనా శివుడి వేపు సానుభూతితో చూస్తూ, "తేలు ఎక్కడ కుట్టింది, శివుడూ?" అంది.

మీనా శివుడికన్నా చిన్నదే. కాని, ఆ అమ్మాయిది జాలి గుండె.

వరండాలో చాప పరిచింది మీనా. ఏడుస్తూ చాప మీద పడుకున్నాడు శివుడు.

మీనా కమలమ్మ దగ్గరకు చేరింది.

"ఏం కావాలి, మీనా?"

"అమ్మా! శివుణ్ణి ఈ రోజు మంచం మీద పడుకోనియ్యవే. పాపం! తేలు కుట్టి ఏడుస్తున్నాడు."

"ఇంట్లో అన్ని మంచా లెక్కడున్నాయే?"

"పోనీ, ఈ రోజు నేను చాపమీద పడుకుంటాను. నా మంచం మీద శివుణ్ణి పడుకోనియ్యి."

వరండాలో మూలుగుతూ పడుకుని ఈ సంభాషణ వింటున్న శివుడి గుండె ఆశతో కొట్టుకుంది.

"ఏడిశావులే! దిక్కుమాలిన వాళ్ళందరికీ మంచాలిస్తే ఇక తిన్నట్టే."

"బాబాయి కొడుకే గదమ్మా?"

"నోర్మూయ్! బాబాయట! బాబాయి!"

శివుడు కుళ్ళి కుళ్ళి ఏడవటం మొదలెట్టాడు. అమ్మ చచ్చిపోయింది, నాన్న చచ్చిపోయాడు. తన కెవ్వరూ లేరు. మంచం కూడా లేదు.

"అమ్మా! నెప్పి!"

రాత్రంతా అలా మూలుగుతూనే ఉన్నాడు. ఆ నెప్పి మరునాడు సాయంత్రానికి పూర్తిగా తగ్గింది.

అంతే. మళ్ళీ మొదలు.

"ఒరేయ్! శివిగా! త్వరగా కానీయ్!"

"పేడకడి సరిగా తీయలేదేం? ఒళ్ళు మంపెక్కింది!"

"నీళ్ళు తొరగా లావు. ఏం రోగమూ! తట్టెడు తింటావు మళ్ళీ!"

ఇంటిలో బండెడు చాకిరీ చేసి, ఓ ముద్ద తిని చాప మీద వాలేటప్పటికి నిద్ర ముంచుకొచ్చేది. ఇక చదివే దెప్పుడు?

"నాన్నా! శివుడిక్కూడా ప్రైవేటు చెప్పించవూ? పాపం! అన్నిట్లోనూ తప్పాడని ఈ రోజు మాస్టారు బాగా కొట్టారు" అంది మీనా.

వెంకట్రావు మౌనంగా ఉన్నాడు.

"ప్రతిదానికీ నీ వత్తాసేమిటే. దరిద్రపు దానా? వీడేం చదివి రాజ్యాలేలతాడా?" అంది కమలమ్మ.



"వాడికి ప్రైవేట్ చెప్పిస్తే నేను ప్రైవేటుకు పోను" అని ప్రతిజ్ఞ చేశాడు మోహన్.

శివుడు చెవులు రిక్కించి వింటున్నాడు. పెదనాన్న తనను గూర్చి సానుభూతిగా ఒక్క మాటైనా మాట్లాడతాడని అతని ఆశ. కాని, వెంకట్రావు ఏమీ మాట్లాడలేదు.

కాని, శివుణ్ణి ఇవేవీ బాధించవు. ప్రైవేటు చెప్పించకపోయినా, తను పరీక్షల్లో తప్పినా, గుడ్డల్లేకపోయినా, చద్దన్నం తినవలసి వచ్చినా అతను నిర్లిప్తుడు. కాని ... కాని, ఆ మంచం! పెద్ద మంచం! ఆ మంచమే కాదు, ఏ మంచంమీద నయినా సరే, పడుకోనిస్తే చాలు.

ఆ పందిరి మంచం పరుపు మీద మోహన్, మీనా ఎక్కి దొర్లుతుంటారు.

"నువ్వూ ఎక్కు, శివుడూ" అని పిలుస్తుంది మీనా.

కాని, ఆ చాయలకు వస్తే మోహన్ తన్నుతాడు. కమలమ్మ కసురుతుంది. నాను నావబాదలేదు. అందుకే దూరం నుంచి ఆ మంచం వైపే చూస్తుంటాడు ఎప్పుడూ. చాలా రోజుల క్రితం అదే మంచం మీద అమ్మా, తనూ హాయిగా పడుకునే వారు. అమ్మ తనని ఎంతో ముద్దు చేసేది. చలి తగలకుండా దుప్పటి [illegible]. ఆయి బువ్వ తినిపించేది. మారాం చేస్తే బుజ్జగించేది. ఇస్త్రీ గుడ్డలు [illegible] ఇచ్చేది. నాన్న [illegible] కసలు గుర్తులేదు. కాని, అమ్మ ...

శివుడి కెప్పుడూ [illegible]

ఇంకెప్పుడూ తను ఆ మంచంమీద పడుకోజాలడు.

ఓ రోజు ఎవరూ లేకుండా చూసి మంచం దగ్గరకు చేరాడు. భయపడుతూ మంచం తాకాడు. కోళ్ళు నిమిరాడు. పరుపుమీద చేయి వేసి వత్తాడు. శివుడి ఒళ్ళు గగుర్పొడిచింది. ఇంతలో అడుగుల చప్పుడు వినబడింది. పారిపోబోయాడు.

"ఆగు ... దొంగ!"

నిలబడి వెనక్కి తిరిగాడు. మీనా నవ్వుతూ నిలబడి ఉంది.

"ఇందాకటినుంచీ నువ్వు చేస్తున్న దంతా చూస్తున్నాలే!"

"పెద్దమ్మకి చెబుతావా? చెప్పద్దు, మీనా!" అతని గొంతు దీనంగా ఉంది.

"ఎందు కంత భయం? చెబితే ఏం చేస్తుందేం?"

"అమ్మో! చంపేస్తుంది. రాత్రి అన్నం పెట్టదు. చెప్పద్దు, మీనా!" అని ప్రాధేయపడ్డాడు శివుడు.

"సరే. చెప్పనులే."

శివుడి ముఖంలో సంతోషం వెల్లి విరిసింది.

"మంచం మీద పడుకోవాలని ఉందా, శివుడూ?" అంది మీనా.

శివుడు జవాబు చెప్పటానికి భయపడ్డాడు. బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూశాడు.

"ఏం, చెప్పవేం? పడుకోవాలని ఉందా?"

అవునన్నట్టు తల ఊపాడు శివుడు.

"అమ్మ వంట చేస్తోంది. ఇప్పుడల్లా రాదు. మంచం ఎక్కి పడుకో. ఊ... తొరగా."

శివుడికి గుండె వాలటం లేదు.

"ఎక్కు ... ఆలస్యం చేస్తే అమ్మ వచ్చేస్తుంది" అంటూ మీనా అతణ్ణి మంచం వేపు తోసింది.

"మీనా" అంటూ కమలమ్మ కేక వినిపించింది.

శివుడు తుర్రున బయటికి పరుగెత్తాడు.

చలికాలపు రాత్రిళ్ళు వరండాలో చాప మీద పడుకున్న శివం, తలుపులు బిగించిన గదుల్లో మంచం మీద దుప్పటి కప్పుకుని పడుకున్నప్పటి సుఖం ఊహించేవాడు.

మంచం! మంచం మీద ఎంత సుఖం! ఇంటి చాకిరీ అంతా తనొక్కడే చేసినా ఫరవాలేదు, మోహన్ కంచంలో పెరుగన్నం చూస్తూ తను [illegible] తిని రావాలి ఫరవాలేదు. తలకు నూనె, ఒంటికి [illegible] [illegible] ఫరవాలేదు. [illegible] ఫరవాలేదు.

అమ్మ లేకపోయినా ఫరవాలేదు. నాన్న లేకపోయినా ఫరవాలేదు. కాని, మంచం! పడుకోవటానికి మంచం ఉంటే చాలు!

ఎలా వస్తుంది మంచం?

తను పెరిగి పెద్దవాడై ఉద్యోగం చేసి, డబ్బులు సంపాదించి పెద్ద మంచం కొనాలి. హాయిగా పడుకుని నిద్రపోవాలి. అప్పుడు వీళ్ళ నెవర్నీ ఆ మంచం మీద పడుకోనివ్వకూడదు ... పాపం! మీనా మంచిది. మీనాను పడుకోనివ్వాలి.

ఇలాంటి ఆలోచనలతో కమ్మగా నిద్రపోతాడు శివం.

ఓ రోజు సాయంత్రం బడి నుంచి వచ్చేసరికి వరండాలో ముసలమ్మ కూర్చుని ఉంది. శివుణ్ణి చూడగానే ఆమె లేచి కావలించుకుని ఒళ్ళంతా నిమురుతూ, "ఎన్నాళ్ళైందిరా, నాయనా, నిన్ను చూసి! అంతా మా రాముణ్ణి చూసినట్టే ఉంది" అని కంట నీరు పెట్టుకుంది.

ఆ అనురాగ ప్రవాహంలో పడి శివుడు ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. తన మీద ప్రేమ కురిపించేవాళ్ళు ఈ విశాల ప్రపంచంలో ఉండగలరని అత నెప్పుడూ అనుకోలేదు.

"ఇవేం గుడ్డలు, ఇదేం తల! ఇలా ఉన్నావేరా, నా తండ్రీ?" అం దామె ఏడుపు గొంతుతో. శివుడు కళ్ళప్పగించి ఆమెవైపే చూస్తున్నాడు.

"అట్లా దిగాలు పడి చూస్తావేం, బాబూ? నేనురా, మీ నాయనమ్మని!"

నాయనమ్మ! నాయనకు అమ్మ! తనకు మరో అమ్మ!

అమ్మ అనే మాట వినగానే శివుడి గుండె ఉద్వేగంతో కొట్టుకుంది. ఒళ్ళు జలదరించింది.

"ఇట్లా కూర్చో" అని నాయనమ్మ శివుణ్ణి ఆప్యాయంగా ఒళ్ళో కూర్చో పెట్టుకుంది. ఇదంతా ఓ పక్కన ఉండి చూస్తూ ఉన్న కమలమ్మ మూతి తిప్పుతూ లోపలికి వెళ్ళిపోయింది. మోహన్, మీనా అలాగే నిలుచుండి పోయారు.

"మాట్లాడవేరా, సదాశివుడూ? నేను మీ నాన్నకి అమ్మనిరా!" అంది ఆమె మళ్ళీ.

"నాన్నకి అమ్మవా?" అన్నాడు శివుడు గొంతు పెకలించుకొని.

"అవున్రా! నిన్ను చూద్దామనే వచ్చాను."

"ఎక్కడున్నావు?"

వెంటనే సమాధానం చెప్పలేక పోయింది ముసలమ్మ. 'ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు? అమ్మా, నాన్నా లేని నన్ను ఇంట్లో రాచి రంపాన పెడుతూంటే, నా లేత నెత్తురు తోడేస్తూ ఉంటే, నన్ను మంచం మీద పడుకోనివ్వకుండా ఉంటే వచ్చి చూడకుండా ఇన్నాళ్ళూ ఎక్కడ ఉన్నావు? ఎక్కడ ఉన్నావు, నాయనమ్మా?' అని ఆ పసివాడు కోటి గొంతుకలతో ఆక్రోశిస్తున్నట్టు తోచింది నాయనమ్మకి.

"పాపిష్టిదాన్ని, బాబూ! మీ అమ్మా, నాన్నా చనిపోయిన తరవాత దిగులుతో వేగ లేక మీ అత్తమ్మ వాళ్ళ ఊరికి వెళ్ళి పోయాను. నాలుగేళ్ళ తరవాత నువ్వెలా ఉన్నావో అనిపించి ఇట్లా వచ్చాన్రా!" అంటూ శివుడి గుడ్డలూ, శరీరం పాలి కమూ చూస్తూ మెల్లగా ఏడవసాగింది ఆమె.

శివుడి గుండెలో ఇన్నాళ్ళూ కరడు గట్టిన దుఃఖం కరగి ప్రవహించసాగింది.

"ఏడవకు, బాబూ! నే నున్నాగా? నీకేం ఫరవాలేదు" అంటూ ఏడుస్తూనే శివుణ్ణి సముదాయించసాగింది నాయనమ్మ.

"స్నానం చేద్దువుగాని, పద" అంటూ అతణ్ణి లేవదీసింది. శివుడు ఉత్సాహంగా బావి దగ్గరకు వెళ్ళి నీళ్ళు తోడసాగాడు.

"అదేమిట్రా? నీళ్ళేవి?"

"ఇవిగో" అంటూ బావివేపు చూపాడు శివుడు.

"చన్నీళ్ళా? నువ్వు తోడుకుంటావా? సబ్బు ఏది? తువ్వాలు ఏది?"

శివుడు తల వంచాడు. నాయనమ్మ నిట్టూర్పు విడిచింది. వేణ్ణీళ్ళతో, సబ్బు రుద్ది, స్వయంగా తనే శివుడికి నీళ్ళు పోసింది. ఆ రోజు అతనికి స్టీలు పళ్ళెంలో కమ్మని భోజనం లభించింది. రోజూ తను సేవించే గేదెపాలు ఇన్నాళ్ళకు ఆరగించాడు. నాయనమ్మ కొసరి కొసరి తినిపించింది. అతనికి స్వర్గసీమలో తేలిపోతున్నట్టు తోచింది.

నిద్ర ముంచుకొస్తూంటే వరండాలో చాప పరిచి దానిమీద వాలాడు.

"ఇదేమిటి, బాబూ? చలిలో కూర్చు న్నావు? రోజూ చాపమీద కూర్చుని చదువుకుంటావా?" అంది నాయనమ్మ.

"అవును, నానమ్మా! ఇక్కడే చదువు కుంటాను, ఇక్కడే పడుకుంటాను."

జనవరి నెల చలిలో ఆ మాట విని నాయనమ్మ కొయ్యబారిపోయింది.

"రోజూనా?"

"ఎప్పుడూ?"

"మంచం లేదా?"

"మంచమా?!" దిగ్భ్రాంతితో కళ్ళు విప్పార్చాడు శివుడు. అతని నిద్రమత్తు వదిలి పోయింది.

"అవును. మంచం లేదా?"

"లేదు."

"ఎందుకు లేదు? ఇంటిలో ఇంత మందికి ఉండగా?"

"నాకు లేదు."

"లోపలికి పద. మంచం మీద పడుకుందాం."

"నిజంగానా, నాయనమ్మా?!" అంటూ ఎగిరి గంతేశాడు శివుడు. అతని కళ్ళు లైటు కాంతిలో ఉజ్జ్వలంగా మెరుస్తున్నాయి.

"అవును, బాబూ, నిజంగానే! నీ మంచం మీదనే పడుకుందాం."

"నా మంచమా?!" తన కో మంచం ఉంటుందని అతనికి తెలియదు.

"నీ మంచమే. ఆ పందిరి మంచం నీదే. మీ అమ్మ పుట్టింటి వాళ్ళు ఇచ్చారు. పద."

ముందు నాయనమ్మా, వెనక శివుడూ లోపలికి వచ్చారు.

మంచం మీద వాసు, మోహన్ పడుకుని కథలు చెప్పుకుంటున్నారు.

"ఒరేయ్! మీ రిద్దరూ మంచం దిగండ్రా!" అంటూ గద్దించింది నాయనమ్మ.

"దిగాలా? ఎందుకూ?" అన్నాడు వాసు నిర్లక్ష్యంగా. అతడు పదో తరగతి చదువుతున్నాడు.

"దాని మీద శివుడు పడుకుంటాడు."

"శివిగాడా?! ఈ మంచం మీదనా?" వాసు నవ్వాడు.

"పొగరు పట్టిందా? శివిగాడేమిటి? ముందు దిగు. ఈ మంచం వాడిది."

"మహ చెప్పావులే పోవమ్మా, ముస లమ్మా!" అన్నాడు వాసు.

"నేను పోవాలా? సరే, నీ వ్యవహారం ఇప్పుడే తేలుస్తానుండు ... ఒరేయ్, పెద్దాడా!" అంటూ పెద్దగా అరిచింది నాయనమ్మ.

శివుడు బిక్కుబిక్కుమంటూ వింటు న్నాడు. అతని వైపు మోహన్ నమిలి మింగేసేట్లు చూస్తున్నాడు.

వెంకట్రావు, కమలమ్మ ఇద్దరూ రంగంలోకి వచ్చారు.

"ఏమిటమ్మా?"

"ఈ మంచం ఎవరిది?" సూటిగా అడిగింది ముసలమ్మ.

"ఎవరి దేమిటి? మాదే" అంది కమలమ్మ.

"నిన్ను అడగలేదు. నువ్వు మాట్లా డకు. వెంకట్రావ్! ఈ మంచం ఎవరిది?"



"మనదే" అన్నాడు వెంకట్రావు.

"ఆమాత్రం నాకూ తెలుసు. ఈ మంచం మన ఇంటి కెలా వచ్చింది?" వెంకట్రావు మౌనం వహించాడు.

"నువ్వు చెప్పవు. కానీ, నాకు తెలియ దనుకున్నావా? శివుడి అమ్మ పుట్టింటి నుంచి తెచ్చింది. అవునా?"

వెంకట్రావుకు ఏమనాలో తెలియ లేదు.

"అవును. అయితే, ఏమిటమ్మా నువ్వ నేది?" అంది కమలమ్మ.

"ఏమిటా! మీరూ బిడ్డల్ని కన్నారు. ఆమాత్రం జాలి లేదా? శివుడు ఎవరనుకుంటున్నారు? ఈ ఆస్తితో సగానికి వారసుడు. పంచుకుంటే ఈ కుంక వెధవకన్నా వాడి కెక్కువే వస్తుంది. అలాంటి వాణ్ణి తల్లీ, తండ్రీ లేరని కడుపునిండా అన్నం పెట్టకుండా, మాసిన బట్టలతో తిప్పుతారా? వీరికి వాళ్ళమ్మ తెచ్చిన మంచం మీద హాయిగా పడుకోనిస్తూ, వాణ్ణి చలిలో నేలమీద దుప్పటి కూడా ఇవ్వకుండా పడుకోమంటారా? అదే మీ బిడ్డలైతే అట్లా వదిలేస్తారా? ఏరా, పెద్దాడా! చచ్చి ఏ లోకాన ఉన్నాడో నీ తమ్ముడు రాముడు ఎప్పుడైనా నీ మాట మీరాడా? నువ్వంటే వాడికి ఎంత అపేక్ష! ఏమే, కమలమ్మా! శివుడి అమ్మ నిన్నెప్పుడైనా పల్లెత్తు మాట అన్నదా? నిన్ను కూర్చో బెట్టి ఇంటిపని అంతా చేస్తూ ఉండేది. అక్కా, అక్కా అంటూ నీ చుట్టూ తిరిగేది. అలాంటి పుణ్యాత్ములకు పుట్టిన నలుసును మీరు ఇట్లా చేస్తారా?" అంటూ వలవల ఏడవసాగింది నాయనమ్మ.

అందరూ నిర్ఘాంతపోయారు. వాసు, మోహన్ మెల్లగా మంచం దిగారు. క్రమంగా ఒక్కొక్కరే ఆ గదిలోంచి తప్పుకున్నారు.

శివుడూ, నాయనమ్మా మాత్రమే మిగిలారు.

నాయనమ్మ కన్నీరు తుడుచుకుని శివుణ్ణి మంచం ఎక్కించింది, దుప్పటి కప్పింది. దోమతెర వేసింది. తనూ మనమడి పక్కనే పడుకుంది.

ఇన్నాళ్ళకి నిద్ర పట్టలేదు శివుడికి. స్వర్గసీమలో తేలియాడుతున్నట్లు తోచింది. పైగా అది అతని అమ్మ మంచం! నాయనమ్మ ఎంత మంచిది!

నాయనమ్మ నిశ్శబ్దంగా చాలాసేపు ఆలోచించింది.

"శివుడూ!"

"ఏమిటే, నానమ్మా?"

"రేపొద్దున్నే నేను వెళ్ళిపోతాను."



జంట ఫోటో—వి. ఉమామహేశ్వర్ (నందిగామ)

కొండ కొననుండి అగాధంలోకి తోసి నట్లైంది శివుడికి.

"వెళ్ళిపోతావా, నానమ్మా! నువ్వు వెళ్ళిపోతే నన్ను మంచం మీద పడుకో నియ్యరు, నానమ్మా!"

"మళ్ళీ వారంలో వస్తాను, బాబూ! అత్తమ్మకి చెప్పి నిన్ను అక్కడికి తీసుకు పోతాను."

"అత్తమ్మ నన్ను రానిస్తుందా, నానమ్మా? కొట్టదా?"

"అత్తమ్మ మంచిది, బాబూ! కొట్టదు. కొత్తగుడ్డ లిస్తుంది. బాగా అన్నం పెడుతుంది."

"పెరుగన్నం పెడుతుందా?"

"పెడుతుంది."

"మరి మంచం మీద పడుకో నిస్తుందా?"

"నీకు మంచి మంచం ఇస్తుంది. అక్కడైతే నీకు అన్నీ బాగా జరుగుతాయి. వస్తావా, బాబూ?"

"వస్తాను, నానమ్మా! త్వరగా వచ్చి తీసుకుపోతావుగదూ?"

"తప్పకుండా తీసుకుపోతాను. ఇక పడుకో."

కళ్ళు మూసుకున్నాడు శివుడు. మీనా గుర్తొచ్చింది.

"మీనాను కూడా తీసుకుపోదాం, నానమ్మా!"

నాయనమ్మ శివుడి తల నిమురుతూ, "అలాగేలే" అంది. శివుడు తృప్తిగా నిద్రపోయాడు.

ఇక నాయనమ్మే వాడికి అమ్మ!

మర్నాడు ప్రొద్దుట శివుణ్ణి చాటుకు పిలిచి తను తెచ్చిన బూరెలు ఇచ్చింది నాయనమ్మ. శివుడు మీనాకు ఓ బూరె ఇచ్చాడు. ఎవరికీ చెప్పొద్దన్నాడు.

నాయనమ్మ తన కూతురి ఇంటికి ప్రయాణం కట్టింది. ఎవరూ ఉండ మనలేదు, మళ్ళీ ఎప్పుడొస్తావని అన లేదు.

నాయనమ్మ ఎక్కిన రిక్షా కదిలి పోతున్న కొద్దీ శివుడి గుండె బరువెక్కా సాగింది. ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయాడు.

గుండెమీది బరువు తీసివేసినట్లైంది కమలమ్మకి.

"పీడా వదిలింది" అంది బిగ్గరగానే.

"నా మంచం మీద పడుకుంటావురా, శివిగా?" అంటూ ఓ పిడి గుద్దు గుద్దాడు మోహన్.

శివుడు ఏడవదలుచుకోలేదు. ఒక్క వారం రోజులు! అంతే! ఆ తరవాత అత్తమ్మ ఇంట్లో ... హాయ్! హాయ్!

ఆ రోజునుంచి శివుడి బ్రతుకు కనాకష్టం కాజొచ్చింది. వాసు చీటికి మాటికి కొట్టడం మొదలెట్టాడు. ఎప్పుడూ లేనిది పెదనాన్న కోపంగా చూడసాగాడు. కమలమ్మ అతని చేత అంట్లు కూడా తోమించటం మొదలెట్టింది. అన్నిటినీ మించి వరండాలో చాప కూడా లేకుండా చేశారు. నాపరాతి నేలమీద దుప్పటి లేకుండా చలికి నిద్ర పట్టటం లేదు శివుడికి.

"నానమ్మ వచ్చి నన్ను తీసుకెళు తుంది, మీనా!" అని మీనాకు ఒకటికి రెండుసార్లు చెప్పాడు.

బళ్ళో స్నేహితులకు కూడా అలాగే చెప్పాడు.

"ఒరేయ్! నేను ఊరికి వెళ్ళిపోతున్నా."

"ఏ ఊరు?"

"మా అత్తమ్మా వాళ్ళ ఊరు."

"ఎప్పు డెళతావు?"

"మా నానమ్మ వచ్చి నన్ను తీసు కెళుతుంది."

"మళ్ళీ ఎప్పు డొస్తావు?"

"ఎప్పటికీ రాను. అక్కడే ఉండి పోతాను. అక్కడ మా అత్తమ్మ నాకు మంచి గుడ్డలు కుట్టిస్తుంది. కొత్త పుస్తకాలు, పెన్ను కొని ఇస్తుంది. ఎంచక్కా మంచంమీద పడుకుంటాను."

వారం గడిచిపోయింది. నాయనమ్మ రాలేదు.

శివుడికి ఆత్రత ఎక్కువైంది. నాయనమ్మ రాదేమో? కాదు, వస్తుంది. తప్పకుండా వస్తుంది. బహుశా రేపు తను బడినుంచి వచ్చేసరికి వచ్చేస్తుంది.

దారిని పోయే ప్రతి రిక్షావేపూ ఆశగా చూస్తున్నాడు శివుడు. ప్రతి ఇంటి ముందూ రిక్షా లాగుతున్నాయి. ఎవరెవరో ముసలమ్మలు దిగుతున్నారు. కాని, నాయనమ్మ మాత్రం దిగటం లేదు.

బళ్ళో స్నేహితులు అడుగుతున్నారు.

"ఏరా, శివం, ఊరి కెళ్ళలేదేం? మీ నాయనమ్మ రాలేదా?"

"రాలేదు. రేపొస్తుంది."

"రాదేమో!"

"కాదు. చూస్తూండు. తప్పక వస్తుంది."

కాని, శివుడి పసి గుండెలో ఆశ అంతరించటం మొదలెట్టింది.

అత్తమ్మ ఒప్పుకోలేదేమో? వాళ్ళింట్లో మంచాలు లేవేమో? లేక పోతే ముసలి నాయనమ్మ చచ్చిపోయిం దేమో? పక్క ఇంటి గోపీ వాళ్ళ నాయనమ్మ కూడా మొన్న చచ్చిపోయింది.

ఈ ఆలోచన వచ్చేసరికి ఏడుపు ముంచుకొచ్చింది.

చాటుకు వెళ్ళి కరువు తీరా ఏడ్చాడు.

ఇక నాయనమ్మ రాదు!

నాయనమ్మ వెళ్ళి నెల రోజులు కావస్తోంది.

శివుడికి ఒంట్లో నలతగా ఉంది. చద్దన్నం తిని తిని, చలిలో నేల మీద పడుకుని అతని ఆరోగ్యం చెడి పోయింది. ఆశాభంగం అతణ్ణి మరింత క్రుంగదీసింది.

ఆ రోజు ఆదివారం. సూర్యు డింకా అస్తమించలేదు. ఆకాశం అంతటా నల్లని మేఘాలు కమ్మి, చల్లని గాలి వీస్తూ ఉంది. వాసు, మోహన్ మాటనీ కెళ్ళారు. వెంకట్రామయ్య బజారు కెళ్ళారు. కమలమ్మ పొరుగింటి కెళ్ళి కబుర్లు చెబుతూ కూర్చుంది.

శివం వరండాలో కూర్చోలేకపోయాడు. ఏదో చలి గుండెలో నుండి గుబులు గుబులుగా చెలువడుతూ ఉంది. తల దిమ్ము మంటూ ఉంది.

చివాలున లేచి పందిరి మంచం ఎక్కి పడుకున్నాడు. దుప్పటి నిండుగా కప్పు కున్నాడు. అయినా, వణికిపోతున్నాడు.

మీనా వచ్చింది. దుప్పటి తీసింది.

"అమ్మ, దొంగా! అమ్మతో చెబుతా నుండు" అంటూ చెయ్యి పట్టుకుంది. ఒళ్ళు సలసల కాగిపోతూంది.

"శివుడూ! నీ ఒళ్ళు వెచ్చగా ఉంది. జ్వరం వచ్చిందా?"

"ఏమో మరి? చలిగా ఉంది. దుప్పటి కప్పు, మీనా."

"కప్పుతానుగాని, అమ్మ వస్తే ఎట్లా?"

శివు డేమీ మాట్లాడలేదు. మీనా దుప్పటి కప్పింది.

కమలమ్మ వచ్చింది. ఆమెకు అను మానం వచ్చింది.

"మంచం మీద పడుకున్నది ఎవరే, మీనా?"

"అన్నయ్య!"

"ఎవరూ, మోహనా?"

"ఊఁ" అంటూ బెరుకుగా తల ఊపింది మీనా.

"మోహన్ సినిమా కెళ్ళాడుగా" అంటూ చివాల్న దుప్పటి లాగేసింది కమలమ్మ.

శివం ముడుక్కుని పడుకుని ఉన్నాడు.

కమలమ్మకు అరికాలి మంట నెత్తి కెక్కింది.

"ఒరి, శివిగా! ఎంత కావరంరా నీకు? పేరుపంతా తొక్కి తొక్కి పాడు చేశావు గదరా! తిని పొగరెక్కి కొట్టుకుం టున్నావు. దిగు ముందు" అంటూ బలంగా వీపు మీద చరిచింది.

"అమ్మా!" అంటూ ఏడుస్తూ లేచి కూర్చున్నాడు శివం.

"అమ్మా! బొమ్మా! అంటూ ఇంకా అక్కడే ఉన్నావేం? దిగు ముందు." గర్జించింది కమలమ్మ.

శివుడు నిశ్చలంగా ఆమె కేసిచూశాడు.

"నేను దిగను. ఇది మా అమ్మ మంచం."

"ఓహో! అప్పుడే అంతవరకూ వచ్చిందే! సరే. అలాగే కూర్చో. నీ పని చెబుతాను" అంటూండగా "ఏమి టేమిటే?" అంటూ వెంకట్రావు ప్రవే శించాడు.

"ఏమిటా? మీ అమ్మగారు చేసిన నిర్వాకం. తల్లీ, తండ్రీ లేని వాడిని కడుపులో పెట్టుకొని కాపాడినందుకు ఫలితం! అది వాడి అమ్మ మంచంట! దిగడట! అప్పుడే వాటాలు కూడా వేస్తు న్నాడు. చూశారా?"

వెంకట్రావు శివుడి వైపు చూసి గుడ్లురిమేశాడు. అతని పొడుగాటి జుట్టు గట్టిగా పట్టుకుని, "అన్న మాట నిజ మేనా?" అని గద్దించాడు. శివు డేమీ మాట్లాడలేదు.

నాన్న కోపం చూసి మీనా వణికి పోయింది.

"ఏం, మాట్లాడవేం?" అంటూ శివుణ్ణి కిందికి లాగి, కర్రతో బాద సాగాడు వెంకట్రావు. కోపంతో అతను కూడా వణికిపోతున్నాడు.

"అమ్మోయ్! బాబోయ్!" అంటూ ఏడుస్తూ పెద నాన్న కాళ్ళు పట్టు కున్నాడు శివుడు. అయినా, వెంకట్రావు కోపం అణగలేదు. "నీకు తోడు మంచం కావాల్రా? మీ అమ్మ మంచమా? నీ బాబు మంచం కాదూ?" అంటూ ఇంకా కొట్టసాగాడు.

"శివుణ్ణి కొట్టద్దు, నాన్నా! శివుడు మంచివాడు, నాన్నా. శివుడికి అమ్మా, నాన్నా లేరు, నాన్నా" అని మీనా ఏడుస్తూ అడ్డొచ్చింది. ఆ అమ్మాయికి కూడా ఓదెబ్బ తగిలింది. అయినా, మీనా లెక్కచెయ్యలేదు. "కొట్టద్దు, నాన్నా! పాపం, శివుడికి జ్వరం వచ్చింది."

తన కసి అంతా తీరిన తరవాత వెంకట్రావు కర్రను జారవిడిచాడు.

"పో. ఈ రాత్రంతా గొడ్ల చావిట్లో పడుకో. వరాండాలో కొచ్చావా కాళ్ళు విరగ్గొడతాను" అంటూ బయటికి నెట్టాడు శివుణ్ణి.

అప్పటికి చీకటి పడింది. వాను, మోహన్ ఇంటికి తిరిగొచ్చారు.

శివుడు ఏడుస్తూ గేదె పక్కనే కూర్చున్నాడు.

అతని కన్నీరు లాగే వాన కురవటం మొదలెట్టింది.

అది పెనుగాలితో కలిసి ప్రచండ వర్షంగా మారింది.

చావిడి అంతా కురవడం మొద లెట్టింది. గాడి దగ్గర మాత్రం పొడిగా ఉంది. కాని, గాడి దగ్గర తేళ్ళుంటాయి. వరాండాలో కెళితే పెదనాన్న కాళ్ళు విరగ్గొడతాడు.

శివం అలాగే ఓ గుంజ నానుకుని నిలువెల్లా తడిసి గజగజ వణుకుతూ నిలుచుండిపోయాడు. ఓ గంట తరవాత అక్కడే బురదలో సొమ్మసిల్లి పడి పోయాడు.

కోడికూత వేళకు వర్షం వెలిసింది.

తెల్లగా తెల్లవారిన తరవాత కమలమ్మ చావడిలోనికి వచ్చి చూసింది. స్పృహ లేకుండా పడి ఉన్న శివుడు కనిపించాడు.

"ఏమండోయ్! త్వరగా రండి" అంటూ కేకలు పెట్టింది.

వెంకట్రావు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

ఇద్దరూ శివుణ్ణి లోపలికి చేర్చారు. మంచి గుడ్డలు తొడిగారు. పందిరి మంచం మీద పడుకోబెట్టారు. డాక్టర్ని పిలిపించారు. ఆయన ఇంజెక్షన్ ఇచ్చాడు.

"నానమ్మా! నేనూ ఊరి కొస్తాను, నానమ్మా! నన్ను తీసుకుపోవూ?" శివుడు పలవరించటం మొదలెట్టాడు.

మంచం చుట్టూ అందరూ మూగారు.

"నానమ్మా! అత్తమ్మ పెరుగన్నం పెడుతుందా?"

కమలమ్మ ఈ మాటలు విని కుమిలి పోసాగింది. వెంకట్రావు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"మీనా మంచిది, నాన్నమ్మా! మీనాను కూడా ఊరికి తీసుకెళదాం."

మీనా ఏడుస్తూ బయటి కొచ్చింది.

వాకిట్లో రిక్షా ఆగింది.

నాయనమ్మ రిక్షా దిగింది.

మీనా నాయనమ్మ దగ్గరకు పరు గెత్తు కెళ్ళింది.

"నాన్నమ్మా! నాన్నమ్మా! శివుడు చచ్చిపోతున్నాడు. నిన్ను పిలుస్తున్నాడు" అంది ఏడుస్తూ.

"ఒరి దేవుడోయ్!" అని నాయ నమ్మ గుండెలు గుద్దుకుంటూ ఒక్క పరుగున మంచం దగ్గరకు వచ్చి పడింది.

శివుడు పలవరిస్తూనే ఉన్నాడు.

"నాన్నమ్మా! అమ్మ మంచంమీద నేను పడుకోగూడదా?"

"పడుకోవచ్చు, బాబూ! ఇప్పుడు పడుకునే ఉన్నావు" అంది నాయనమ్మ కళ్ళు వత్తుకుంటూ.

"నాన్నమ్మా! అత్తమ్మ పెరుగన్నం పెడుతుందా?"

"పెడుతుంది. నిన్ను అత్తమ్మ దగ్గ రకు తీసుకు వెళ్ళటానికే వచ్చాన్రా, బంగారు నాయనా!" అంటూ విలపించ సాగింది నాయనమ్మ.

"నాన్నమ్మా! అత్తమ్మ మంచం మీద పడుకోనిస్తుందా?"

నాయనమ్మకు దుఃఖావేశంతో నోట మాట రాలేదు.

ఇంట్లో అందరూ అదే స్థితిలో ఉన్నారు.

"నాన్నమ్మా! అత్తమ్మ మంచం మీద పడుకో నిస్తుందా!" అంటూ శివుడు తన అమ్మ మంచం మీద శాశ్వతంగా కన్నులు మూసుకున్నాడు.



వాహ్యాళి

చిత్రం— వి. రవీంద్రనాథ్ (ఉయ్యూరు)